ఆ రోజు నా మొట్టమొదటి పెళ్ళిచూపులు. 'నాదికాని పెళ్ళాన్ని' చూడ్డానికి ఇంట్లో అంతా బయలుదేరారు.

అమ్మా, నాన్న, బామ్మ, చిన్నాన్న, పెదనాన్న, వగైరా చుట్టాలు అంతా కట్టకట్టుకుని బయలుదేరి వెళ్ళాం.

వాళ్ళు చాలా బాగా మర్యాదలు చేశారు.

అమ్మాయిని తీసుకొచ్చి నాకెదురుగా చాలా దూరంలో కూర్చోబెట్టారు. అసలే అమ్మాయి నాకు చాలా దూరంలో వుంది. పైగా ఆ అమ్మాయి తల భూమిలోకి కుంచించుకుపోయింది.




నాకు ఛస్తే మొఖం కనిపించలేదు. నేను కూడా తల వంచుకొని చూద్దామనుకున్నాగానీ నా ప్రయత్నం ఫలించలేదు.

ఆడవాళ్ళంతా దగ్గర కూర్చొని ఎలాగో తంటాలుపడి కష్టపడి చూశారు. మగవాళ్ళెవరికీ ఆ అదృష్టం కలగలేదు.

ఈలోను ఎవరో గానీ 'పాట పాడమ్మా' అన్నారు.

పాపం సంగీతం నేర్చుకుందేమో అడిగిందే తడవుగా రాగం ఎత్తుకుంది.

ఒక పది నిముషాలు పాటు మత్తుగా నిద్రపోయాను. అందరూ తన్మయంగా పాట వింటున్నారేమో నన్ను పట్టించుకోలేదు.

పాటవ్వగానే మా నాన్న నన్ను తట్టిలే పారు. ఉలిక్కిపడి లేచి సర్దుకొని కూర్చున్నాను. ఈలోగా ఫలహారాలన్నీ తెచ్చిపెట్టారు.

నాకసలే పిండివంటలు, ఫలహారాలు, ఇత్యాది వంటకాలంటే పిచ్చి. వాళ్ళు పెట్టిన వన్నీ సుష్టుగా తిన్నాను. నాకు అన్నింటిలోకి సున్నుండలు బాగా నచ్చాయి.

మా బామ్మ అనుకుంటా 'పేరేమిటమ్మా' అనడిగింది.

'రుక్మిణి' చాలా సిగ్గుపడుతూ చెప్పింది. ఆ మాట నాకు వినిపించలేదు. ఎవరో అంటే విన్నానంతే.

"ఏరా గోపాలకృష్ణా అమ్మాయి నచ్చలేదా' బామ్మ అడిగింది.

"నచ్చడానికి అసలు ఆ అమ్మాయి ముఖం నాకు కనిపిస్తేగా" అన్నాను.

"మరేం చూశావేమిటి?" అందరూ నిలదీశారు.

"ఆ అమ్మాయి తల, తల వెనుక చామంతి పువ్వుల చెండు. అప్పటికీ ఒక్కసారి మరీ నిట్టించుకుని చూశాను/ ఆ అమ్మాయి తల్లో పేను మాత్రం పాకుతూ కనిపించిందంతే" అన్నాను.

అందరూ నవ్వేశారు ఆ మాటకి.

చివరికి ఆ రుక్మిణినే నాకిచ్చి పెళ్ళి చేశారు.

●●

నా జీవితంలో లోటుపాటులు, మంచి చెడులు అటువంటి నేవీలేవు. దేవుడు నాజీవితంలో కష్టాల గురించి ఏమీ రాయలేదేమో! ఎందుకని?

●●

నా క్రొత్త జీవితం ప్రారంభమైంది.

నా 'నడుము పెళ్ళాం' మంచిదే. నాకు కావలసినవన్నీ వండి పెడుతుంది. సున్నుండలని మరీ ఎక్కువగా చేయించుకొని తింటున్నాను.

ఉదయం లేవగానే ఒక రెండు గంటలు బాగా నడవడం, మొక్కలకి నీళ్ళు పోయడం. ఇదీ నా దినచర్యలో భాగం.

'ఏమండీ మొన్న అమ్మా వాళ్ళు రమ్మని ఉత్తరం రాశారు. నోములేవో పట్టించాలట. వెళ్ళమంటారా?" చీర కొంగును మెలిపెడుతూ అడిగింది రుక్మిణి.

కొంచెంసేపు నేను రుక్కునైపు అలాగే చూశాను.

"వద్దంటారా ఏమిటి? అలా చూస్తారేమిటి?" దబాయించినట్టు అడిగింది.

"ఎందుకే ఆ నోములూ, వ్రతాలూ మంచి మొగుడి కోసమేగా. మంచి మొగుణ్ణి దొరికాను. ఇక నువ్వు పది కాలాలపాటు పసుపు, కుంకుమలతో వుడడానికంటావా ఆ వరం నేనే ఇస్తున్నాను. నాకు మారేళ్ళ ఆయుష్షు వుంది. ఇద్దరం వందేళ్ళు చక్కగా కాపురం చేస్తాం కానీ ఆ నోములూ వ్రతాలూ నోచి ఉపవాసాలంటూ నా కడుపు కొట్టమాకు' కరాఖండిగా చెప్పాను.

ఆ రోజు నుండి 'నోములు' అన్న పేరు ఇంట్లో వినిపించలేదు. ఈలోగా నా భార్యకు పిల్లలు పుట్టుకొచ్చారు. ఇద్దరు మొగపిల్లలు, ఇద్దరు ఆడపిల్లలు.

ఆఖరి పిల్ల పుట్టేటప్పుడు అది చాలా అవస్థపడింది. 'నేను చచ్చిపోతే పిల్లల్ని చక్కగా చూసుకోండి' అని చెప్పింది.

"నువ్వు చచ్చిపోవు రుక్కూ. నా జీవితంలో రెండో పెళ్ళి ప్రసక్తి లేదు. రుక్మిణి వుండగా సత్యభామ ఎందుకు? నువ్వేమీ కంగారు పడకు. నీ ప్రాణం పోకుండా వుంచే పూచీ నాది' అన్నాను.

'ప్రతీదానికీ వితండవాదం మాట్లాడతారు' అంత కష్టంలో కూడా నవ్వేసింది. చివరికి నలుగురు పిల్లల తల్లయింది.

అందర్నీ దాని యిష్టప్రకారమే పెంచుకుంది.

'నన్ను ఏదైనా సలహాలడిగినా తగిన సమాధానం దొరికేది కాదు ఆ పిచ్చిదానికి.

అందర్నీ బడిలోకి పంపుతోంది.

'నన్ను ఎవ్వరూ పంపించలేదు. మా యింటికే పంతులు వచ్చి చెప్పేవాడు. వాళ్ళని కూడా పంపద్దు' అన్నాను.

'అప్పటి రోజులు వేరు, ఇప్పటి రోజులు వేరు మీరు మాట్లాడకండి' కొద్దిగా నోరు వచ్చింది నా పాత పెళ్ళానికి.

వాళ్ళు ఏం చదువుతున్నారో కూడా నాకు తెలీదు. వాళ్ళకి చదువైతే చెప్పేవాణ్ణి కాదు కానీ, దగ్గర కూర్చో పెట్టుకుని రుక్కునద్దా కథలు చెప్పేవాణ్ణి.

నేను ఏది చెబితే అదే నిజమనుకొని వినే వాళ్ళు నా పుత్రరత్నాలు. వాళ్ళకి ఎక్కువగా భారత, రామాయణాలు చెప్పేవాణ్ణి.

'రుక్మిణి కృష్ణుడ్ని స్వయంగా వరించి నేను కుంది. తరువాత రుక్మిణిని రావణాసురుడు ఎత్తుకొని వెళ్ళిపోయాడు. రుక్మిణిని రక్షించడం కోసం కృష్ణుడు రావణాసురుడితో యుద్ధంచేసి

రుక్మిణిని రక్షించుకున్నాడు. ఆ విధంగా రావణాసురుడు కృష్ణుని చేతిలో చచ్చిపోయాడు' అదీ రామాయణం.

'సీతను రాముడు ఎత్తుకొని వెళ్ళి పెళ్ళి చేసుకొన్నాడు. శిశుపాలుడ్ని వధించాడు. భారత సంగ్రామంలో అర్జునికి రాముడు గీతోపదేశం చేశాడు' అదీ భారతం.

టూకీగా నాకు తోచినట్టు చెప్పాను. పిల్లలు పత్తికాయల్లా కళ్ళు చేసుకొని చూసేవారు నా వంక.

మరునాడు వాళ్ళ మాష్టారు పిల్లల్ని ఛడామడా తిట్టి, నాలుగుతన్ని పంపారంట. ఏడ్చుకుంటూ ఇంటికి వచ్చి చెప్పారు వాళ్ళ అమ్మతో. వాళ్ళుచెప్పింది విని నా దగ్గరికి ఎప్పుడూ కథలు వినడానికి పంపేది కాదు. వీలు చేసుకొని అదే చెప్పకునేది.

'ఎలా చెప్తే ఏమి రుక్కూ, వాళ్ళకేమి తెలుసు. ఇక ముందు ఆ పాత పురాణాలు, ఇతిహాసాలు వాళ్ళకెందుకు ఉపయోగపడతాయి. వెరైటీగా వుండాలని అలా చెప్తావంతే' అన్నాను.

నన్ను చేతకాని చవటలాగా చూసింది. తరువాత నా పిల్లల చదువు విషయంలో కూడా నన్ను ఏమీ అడిగేవాళ్ళు కాదు. పాపం వాళ్ళు అడిగినా నేను చెప్పే వాణ్ణి కాదు. పెద్దవాడు డిగ్రీ పాసయ్యాడంట. ఏదో నోబెల్ బహుమతి వచ్చినంత ఆనందంగా వచ్చి చెప్పాడు.

అప్పుడు తెలిసింది నా పిల్లలు అప్పుడే అంత పెద్దవాళ్ళయ్యారా అని. చిన్నవాడికి చదువు అంతగా అబ్బలేదు. వాడు ఏదో బిజినెస్‌లో పడ్డాడు.

ఒక రోజు నా భార్యామణి నాకు గుర్తు చేసింది. 'వాళ్ళకి పెళ్ళిళ్ళు చేయాలి, మంచి సంబంధాలు చూడండి' అని.

'వాళ్ళకి సంబంధాలు ఏం చూస్తాం, రోజులు చాలా మారిపోయాయి. వాళ్ళే ఏ పిల్లల్నయినా చేసుకొని దండలు వేసుకొని ఇంటికొస్తారు చూడు, మన కెందుకు ఆ శ్రమ' అన్నాను.

నా ధోరణికి అలవాటు పడిందనుకుంటా. ఒక వెర్రి చూపొకటి నా మొఖాన పారేసి వెళ్ళిపోయింది.

నేను చాలా రోజులు ఎదురు చూశాను. నా పుత్రరత్నాలు అలా పెళ్ళి చేసుకొని వస్తారేమో అని

'ఛీ...వీళ్ళ మొఖం ఏం పిల్లలు? వాళ్ళ మొఖానికి ఒక్క ఆడపిల్ల కూడా కనిపించలేదు కాబోలు, వెర్రి వెంగళప్పలు'

ఎవరో ఇద్దరు ఆడపిల్లల తండ్రులు వచ్చారు ఇంటికి ఒకసారి, నా పుత్ర రత్నాలకి ఇస్తామంటూ

'మా వెర్రిబాగులవాళ్ళని అడిగితే గంగిరెద్దుల్లా తలలూపారు చేసుకుంటామని'

వాళ్ళకి పెళ్ళిళ్ళు అయిపోయాయి. పెద్ద కోడలు రమ, చిన్న కోడలు ఉష ఇద్దరూ మంచివాళ్ళే. ఎప్పుడూ అత్తా మామలనే అంటిపెట్టుకుని ఉంటారు పిచ్చిమొఖాలు.

బాగా కలిసిపోయారు ఇంట్లో. పెద్దవాడికి ఉద్యోగం వచ్చిందని వేరే ఊరు వెళ్ళడానికి నా పెద్ద కోడలు, కొడుకు ఏడ్చారు.

ఇంట్లో అందరూ శోక సముద్రంలో మునిగిపోయారు.

చివరికి విడవలేక విడిచి వెళ్ళారు మమ్మల్ని. ఆ రోజు నుంచి మా పెద్ద కోడలు రోజుకో ఉత్తరం రాసేది.



చిన్న కొడుక్కి ఊళ్ళోనే వ్యాపారం. ఇక నా రుక్కు దృష్టి కూతుళ్ళ మీద పడింది. వాళ్ళకి పెళ్ళి చెయ్యాలని.

కొద్ది రోజులకి వాళ్ళకీ కుదిరి పోయాయి. నేనేదో అల్లుళ్ళని సంతోష పరచాలని చూస్తే వాళ్ళో తెలివితక్కువ దద్దమ్మలు. ఏవీ వద్దంటారు టి.వి., ఫ్రిజ్, ఫర్నిచర్ మొదలైన సామాను అంతా ఇస్తామంటే వద్దన్నారు.

ఏం చేస్తాం? నేననుకున్న అల్లుళ్ళు రాలేదు. చుట్టుపక్కల వాళ్ళంతా మా జామాతలని చూసి మురిసిపోయారట.

ఒక రోజు తీరిగ్గా వసారాలో పడక కుర్చీలో కూర్చుని ఆ రోజు పేపరుని తిరగేస్తున్నాను.

మా ఇంటి పక్కన వున్న వెంకట సుబ్బయ్య నాకోసం వచ్చాడు. వస్తూనే పలకరింపుగా నవ్వి 'ఏమిటి విశేషాలు?' అనడిగాడు.

"ఏమైనా కొత్త విశేషాలు ఉన్నాయా ఊళ్ళో?" అనడిగాను, తనకి ఏవో ఉన్నాయని నేనెందుకు బయటపడాలి.

'ఆ ఏమి విశేషాలులెండి రోజులు మారిపోతున్నాయి. ఇక మన తరం కూడా అయిపోయినట్టే' దీర్ఘంగా నిట్టూర్చాడు.

అంత వైరాగ్యం అతగాడికి ఎందుకు వచ్చిందో నాకర్థం కాలేదు. 'ఇప్పుడేమయిందని?' చదువుతున్న పేపరును పక్కనపెట్టి అన్నాను. నావంక తదేకంగా చూసి 'నిన్నటితో నేను రిటైర్ అయ్యాను' చాలా నీరసంగా చెప్పాడు.

ఓహో అదా విషయం. చక్కగా రెస్టు దొరికినందుకు సంతోషించక ఆ బాధ అంతా ఎందుకు?

ఏమిటో ఆ వెంకట సుబ్బయ్యకు ఎప్పుడూ తపనే. ఏదో సంపాదించాలని, ఏదో తెలియని ఆరాటం అతడి ముఖంలో స్పష్టంగా కనిపిస్తుంది. ఏదో కష్టపడ్డాడు. ఇక చాలదా? ఆస్తి ఉన్నా పెద్ద ఉద్యోగంలో జాయిన్ అయ్యాడు. ఎప్పుడూ కష్టాలు పడుతున్నట్టే ఫీలవుతూ ఉంటాడు దేనికి ఆ ఆరాటం? నాకర్థం కాదు.

'హాయిగా రెస్టు తీసుకోండి. ఇక శేష జీవితాన్ని హాయిగా గడపండి.' అతనికి ఏదో తెలియనట్టు ఉచిత సలహా చెప్పాను.

'సర్లేండి మీ అంత హాయి అందరికీ ఉండొద్దు. మీ అంత గోల్డెన్ లైఫ్ మాకు రావద్దూ?' మాటల్లో సంతోషం కన్నా, ఈర్ష్యే ఎక్కువగా కనపడుతోంది.

'దానికి ఎవరేం చేస్తారు, అంతా విధాత లీల' కొద్దిగా మనస్సుని శాంత పరచడానికి చెప్పాను.

'అంతే లేండి' కొద్దిసేపు అతడి బాధలన్నీ ఏకరువు పెట్టాడు.

అంతా ఓపిగ్గా విన్నాను. అంటే నాకప్పుడే ముసలి వయస్సు వచ్చేసిందన్నమాట. నాకైతే అలా అనిపించడం లేదు.

నా ముసలి పెళ్ళాం చేత కప్ప కాఫీ ఇప్పించి పంపాను.

అప్పుడు చూశాను రుక్కువైపు జుట్టంతా ముగ్గ బుట్టలా అయింది. మరి ఇన్ని రోజుల నించి నాకలా అనిపించలేదేమిటి?

అదేమాట దాంతో అన్నాను. "ఆ...మీరింకా పదహారేళ్ళ బాలాకుమారుడు అనుకుంటున్నారేమిటి? మనవళ్ళు, మనవరాళ్ళు కూడా వచ్చిన తరువాత" ఇంత పొడుగున సాగదీసింది.

నా జీవితంలో అన్నీ నేను కోరుకోకుండానే జరుగుతున్నాయి. అందరి జీవితాలతో పోల్చుకుంటే నా జీవితం నాకే వింతగా అనిపిస్తుంది. విచిత్రంగా వుంటుంది.

కొద్దిపాటి కష్టం కూడా తెలియదు. జీవితంలో లోటుపాతులు మంచి చెడులు, అటువంటివి ఏవీ లేవు.ఎందుకని?

నా కెందుకు ఈ ప్రత్యేకత. దేముడు నా జీవితం గురించి, నా కష్టాల గురించి ఏమీ రాయలేదేమో?

నేను జీవితాన్ని చాలా ఈజీగా తీసుకున్నాను.

నా ముసలి పెళ్ళాం చాలా మారిపోయింది. ఇంకా ముస్సలామెగా కనిపిస్తోంది.

'ఆత్మకథ' రాయడం పూర్తి చేశాను.

దాన్ని రుక్కుకి ఇవ్వాలి. ఎలా చూస్తుందినన్ను. సంతోషంగానా? కోపంగానా?

జారిపోతున్న కళ్ళజోడు సరిచేసుకొని చూశాను. ఎదురుగా రుక్కు వస్తోంది కాఫీ కప్పతో.

'ఏమిటి మీ మొఖంలో ఏదో మార్పు కనిపిస్తోంది. సంతోషంగా ఉన్నట్టున్నారు' కాఫీ కప్ప అందించింది.

పుస్తకాన్ని చేతికిచ్చాను.

'ఏమిటిది' ప్రశ్నార్థకంగా చూసింది.

'చదువు' కళ్ళతోనే సైగ చేశాను.

మొదటి పేజీ చదవటం మొదలుపెట్టి మొత్తం చదివే వరకూ వదల్లేదు. మొత్తం చదివాక నా వైపు చూసింది ఆమె మొహంలో ఎంతో ఆనందం. చాలా ప్రశంసగా చూసింది.

జీవితంలో మొట్ట మొదటిసారి ఒక మంచి పని చేశానన్నట్టు చూసింది నా వైపు.

నేను చాలా గర్వంగా ఫీలయ్యాను. ●